

బేరాలు.. బెదిరింపులు!

లాటరీలో మద్యం దుకాణాలు పొందిన వ్యాపారులపై కూటమి నేతలు బెదిరింపులకు దిగుతున్నారు.

- 8లో



విహంగం.. స్వాగతం

నేలపట్టు పక్షుల కేంద్రానికి విదేశీ విహంగాల రాక మొదలైంది. అక్కడి చెట్లపై వలస పక్షుల సందడి ఆరంభమైంది.

- 8లో



తిరుమలలో భారీ వర్షం

తిరుమలలో బుధవారం భారీ వర్షం కురిసింది. చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

- 8లో

అలజడి



తూపిలిపాళెం బీచ్‌లో ఎగసి పడుతున్న అలలు

వాయుగుండం ప్రభావంతో సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. తీరంలో ఈదురుగాలులు బలంగా వీస్తున్నాయి. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. అడుగంటిన చెరువులు పునరుజ్జీవం పొందుతున్నాయి. పలు చోట్ల కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కాజ్‌వేలపై వరద నీరు చేరడంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ క్రమంలోనే అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. రిజర్వాయర్ల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రాణ నష్టం సంభవించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కడికక్కడ బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. భోజన వసతులు కల్పిస్తున్నారు. విద్యాసంస్థలకు సైతం సెలవులు ప్రకటించారు. అయితే ప్రజాప్రతినిధులు మాత్రం సహాయక చర్యలకు దూరంగా ఉండడంపై జిల్లావాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆపత్కాలంలో అండగా నిలవకపోవడంపై మండిపడుతున్నారు.

- అల్లకల్లోలంగా సముద్రం
- జిల్లాలో ఎడతెరపి లేని వర్షం
- కాజ్‌వేలపై ఉప్పొంగుతున్న ప్రవాహం
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నేడు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన అధికారులు
- పునరావసకేంద్రాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు
- ప్రాజెక్టులు, చెరువులకు చేరుతున్న నీరు

తిరుపతి అర్బన్ : జిల్లాలో వాయుగుండం ప్రభావంతో బుధవారం భారీ వర్షం నమోదైంది. గురువారం అతి భారీ వర్షం కురిసే అవకాశముందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఆ మేరకు జోరుగా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలో సోమ, మంగళవారాలు పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు. అయితే బుధవారం భారీగా వర్షం కురవడంతో వరద కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అయా ప్రాంతాల్లోని బాధితులను రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో పునరావాస కేంద్రాలకు తరలించారు. భోజన వసతులు కల్పించారు. అయితే మరో రెండు రోజులు వర్షం కురిస్తే పలు కాలనీలు నీట మునిగే ప్రమాదముందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ మేరకు గురువారం జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.



తిరుపతి పూలవాని గుంటలో ఇంట్లోకి ప్రవేశించిన నీటిని బయటకు తోడుతున్న మహిళ

రాకపోకలకు అంతరాయం

- శ్రీకాళహస్తి రూరల్ మండలం ముచ్చివోలు సమీపంలోని సున్నపుకాలువ కాజ్‌వేపైకి ఉప్పొంగుతోంది. దీంతో ఆ మార్గంలోని సుమారు 20 గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. కాజ్‌వే పైకి ఎవరూ వెళ్లకుండా స్థానికులు ముళ్లకంపలు వేశారు.
- వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురం వద్ద కాజ్‌వేపై ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో 14 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.
- ఓజిలి మండలం పున్నేపల్లి మార్గంలోని కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తోంది. రాకపోకలు లేక 8 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- పెళ్లకూరు మండలం పాలచ్చూరు వద్ద లోలెవల్ కాజ్‌వేపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలోని 11 గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి.
- శ్రీకాళహస్తి మండలం ఈదులగుంట కాజ్‌వేపై ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో పలు ఎస్టీకాలనీవాసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



శ్రీకాళహస్తి : ముచ్చువోలు కాజ్‌వే వద్ద నిలిచిన బస్సు

ప్రమాదంలో చెరువు కట్టలు.. వరవ కాలువలు

- తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం చెరువు కట్ట వర్షాలతో దెబ్బతింది.
- బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని సంతవేలూరు, గాజుల పెళ్లూరు గ్రామాల చెరువు కట్టలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయనిఅధికారులు ఇప్పటికే గుర్తించారు.
- అలాగే పలు చెరువుల కలుజులు సైతం శిథిలావస్థలో ఉన్నాయి.
- అలాగే జిల్లాలో సుమారు 40 వరవకాలువలు దెబ్బతిన్నాయి. దీంతో చెరువులకు నీరు చేరడం లేదు.
- ప్రధానంగా ఏర్పేడు మండలంలోని పల్లం, పంగూరు, శ్రీకాళహస్తి మండలంలోని కలవగుంట, బ్రాహ్మణపల్లె,, తొట్టంబేడు మండలంలోని కాసరం, చియ్యవరం, రేణిగుంట మండలంలోని మల్లవరం తదితర గ్రామాల్లోని వరవ కాలువలు మరమ్మతులు చేయించాల్సి ఉంది.



శ్రీకాళహస్తి : ఉధృతంగా ప్రవహిస్తున్న సున్నపుకాలువ

పునరావాసం కేంద్రాల ఏర్పాటు



పునరావాస కేంద్రాలను పరిశీలిస్తున్న సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి

- చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలంలోని గాంధీపురం, సి.మల్లవరం, పేరూరు, ఏకాంతపురం వాటి సమీప కాలనీలను లోతట్టు ప్రాంతాలుగా అధికారులు గుర్తించారు. వారికి 9 చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- తిరుపతి నగరంలో 12 లోతట్టు ప్రాంతాలను గుర్తించారు. ప్రధానంగా గొల్లవానిగుంట, తెల్లగుంట, పూలవానిగుంట, కొర్లగుంట, నారాయణపురం ఎస్టీకాలనీ, తిరుమలనగర్‌తోపాటు పలు ఎస్టీకాలనీవాసులకు మొత్తం 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- శ్రీకాళహస్తి పట్టణంలోని చెంచులక్ష్మికాలనీ, ఈదులగుంట ఎస్టీకాలనీ, శుకబ్రహ్మాశ్రమం ఎస్టీ కాలనీ, బృందమ్మకాలనీ తదితర ప్రాంతాల వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగరిలోని బాధితులను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు.



శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నది ప్రవాహం

న్యూస్‌రీల్

పోటెత్తిన అరుణానది



ఉత్తరపు కండ్రిగ కాజ్‌వే వద్ద పోలీసుల పహారా

నారాయణవనం : భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని అరుణానది పోటెత్తింది. తిరువట్యం, తుంబూరు, పాలమంగళం నార్త్ గ్రామాల వద్ద లోలెవల్ కాజ్‌వేపై వరద నీరు ఉప్పొంగుతోంది. దీంతో రాకపోకలను నిలిపివేశారు. సచివాలయ సిబ్బంది, పోలీసుల పహారా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాలను శ్రీకాళహస్తి ఆర్డీఓ, డ్వామా పీడీ పరిశీలించారు.

41.9 మిల్లీమీటర్ల వర్షపాతం

తిరుపతి అర్బన్ :వాయుగుండం ప్రభావంతో బుధవారం రాత్రి 7గంటల వరకు జిల్లాలో సరాసరిగా 41.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఏర్పేడు మండలంలో 102.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా వరదయ్యపాళెం మండలంలో 11 మిల్లీమీటర్లుగా అధికారులు వెల్లడించారు. అలాగే పెళ్లకూరులో 83.4, రేణిగుంట–79.4,శ్రీకాళహస్తి–70.8, దొరవారిసత్రం– 66.8, తొట్టంబేడు–63.6, వడమాలపేట– 62.6, వెంకటగిరి–61.2, నారాయణవనం– 61.0, తిరుపతి అర్బన్–52.4, తిరుపతి రూరల్–49.2, పుత్తూరు– 49.2, రామచంద్రాపురం–41.6, చిల్లకూరు– 38.6, డక్కిలి– 38.0, సూళ్లూరుపేట–37.4, పిచ్చాటూరులో 36.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు,

కల్యాణీ డ్యామ్ పరిశీలన



కల్యాణీ డ్యామ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కల్యాణిడ్యామ్‌ను తహసీల్దార్ శివరామ సుబ్బయ్య, సీఐ సుబ్బరామిరెడ్డి, ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. వరద నీరు ఇన్‌ఫ్లో వివరాలను ఆరా తీశారు. ఎప్పటికప్పుడు వరద నీటికు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.

ఉధృతంగా జలపాతం



తలకోన జలపాతంలో వర్షపు నీటి ఉధృతి

భాకరాపేట : తలకోన అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జలపాతం ఉధృతంగా మారింది. దీంతో పలు వంకలు, వాగుల్లో ప్రవాహం పెరిగింది. కొటకాడపల్లె వద్ద రోడ్డుపై వరద నీరు చేరింది. ఈ క్రమంలో నీటి ప్రవాహంలోకి ఎవరూ ప్రవేశించకూడదని అధికారులు దండోరా వేయించారు.

రిజర్వాయర్లకు నీరు

జిల్లాలోని కాళంగి రిజర్వాయర్, కల్యాణీ డ్యామ్, కండలేరు జలాశయం నుంచి తెలుగుగంగ కాలువ, మల్లెమడుగు రిజర్వాయర్, స్వర్ణముఖినది, కై వల్య నది, పంబా నది, తొండమనాడు చెరువు వీటి ఆధారంగా జిల్లాలో 50శాతానికిపైగా భూములు వ్యవసాయం చేస్తుంటారు. వీటిలో వర్షాలకు ముందు కేవలం 10శాతం నీటి మట్టం మాత్రమే ఉండేది. వర్షాలతోపాటు 30 నుంచి 35శాతానికి నీరు చేరినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరో రెండు రోజులు ఇదే వర్షాలు కురిస్తే పూర్తిగా నిండుతాయని భావిస్తున్నారు. మరోవైపు జిల్లాలోని 450 చెరువుల్లో కేవలం 20శాతం నీరు మాత్రమే ఉండేది. అయితే ఈ వర్షాలతో 40 శాతానికి పెరిగిందని అధికారులు వెల్లడిస్తున్నారు.

ఉగ్రరూపం దాల్చిన సముద్రం



సముద్ర తీరంలో కురుస్తున్న భారీ వర్షం

వాకాడు : మండలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం ప్రభావంతో సముద్రం ఉగ్ర రూపం దాల్చింది. తూపిలిపాళెం తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. సముద్రం 10 మీటర్ల వరకు ముందుకు వచ్చింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈదురు గాలులతో బీచ్ వద్ద ఏర్పాటు చేసిన చిల్లర దుకాణాలు నేలకూలాయి.

ఈదురుగాలులతో వర్షం

చిల్లకూరు : సముద్రంలో అలల ఉధృతి అధికంగా ఉంది. అధికారుల సూచన మేరకు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా తీరానికే పరిమితమయ్యారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వరద నీరు నిల్వ చేరకుండా ఎప్పటికప్పుడు తొలగింపు చర్యలు చేపడుతున్నారు. అయితే సాగరమాల రహదారి నిర్మాణం కారణంగా గోనుగుంట గ్రామం నుంచి వరద నీరు వెలుపలికి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో అధికారులు యంత్రాల సాయంతో నీటిని బకింగ్‌హామ్ కెనాల్‌లోకి పంపింగ్ చేయిస్తున్నారు. రామారెడ్డిపాళెం సమీపంలోని గిరిజన కాలనీలోకి వర్షపు నీరు చేరింది. వారిని సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలోకి పునరావాసం కింద తరలించారు.

శిథిలావస్థలో షెల్టర్లు

తుపాను సమయంలో తీర ప్రాంతవాసులు తలదాచుకోవడానికి తుపాను షెల్టర్లు నిర్మించారు. మండలంలో మొత్తం 19 షెల్టర్లు ఉన్నాయి. అయితే వాటిలో నాలుగు మినహా మిగిలినవన్నీ శిథిలావస్థకు చేరాయి. దీంతో తుపాను బాధితులను సురక్షిత ప్రాంతాలు అందుబాటులో లేకుండా పోయాయి.

'శ్రీవారి మెట్టు' మూసివేత

చంద్రగిరి : భారీ వర్షాల నేపథ్యంలో గురువారం పూర్తిగా శ్రీవారి మెట్టు కాలినడక మార్గాన్ని మూసివేశారు. బుధవారం ఈమేరకు టీటీడీ ఈఓ శ్యామల రావు అధికారులను ఆదేశించారు.



రేణిగుంట జ్యోతిరావుపూలే కాలనీలోని ఓ ఇంట్లో చేరిన వర్షపు నీరు



తిరుపతి పూలవాని గుంటలో ఇంట్లోకి నీరు ప్రవేశించడంతో దిక్కుతోచని స్థితిలో మహిళలు



తిరుపతి కాటన్‌మిల్లు వద్ద ఇంట్లోకి నీరు రావడంతో పసికందును బయటకు తీసుకెళుతున్న మహిళ



నారాయణవనం : సముదాయం వద్ద కాజ్‌వే పైకి ఉప్పొంగుతున్న అరుణానది

అడ్రస్ లేని ఎమ్మెల్యే ఆరణి

వాయుగుండం ప్రభావంతో తిరుపతిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లు జలమయమయ్యాయి. మురుగు కాలువలు ఉప్పొంగడంతో కాలనీలకు కాలనీలే దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రజలు ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ఉంటే స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాత్రం అడ్రస్ లేకుండా పోయారు. బాధితులను ఆదుకోవడం సంగతి దేముడెరుగు.. కనీసం పరామర్శించి పాపాన పోలేదు. అధికారులు ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాలను సైతం సందర్శించలేదు. ఈ క్రమంలోనే టీడీపీ నాయకులు సైతం కనుచూపు మేరలో కనిపించకుండా పోయారు. కూటమి నేతల వైఖరిపై నగరవాసులు మండిపడుతున్నారు. ఆపత్కాలంలో ఆదుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరదలు వచ్చినప్పుడు అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అందించిన సేవలను గుర్తుచేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షించిన తీరును కొనియాడుతున్నారు.

- లోతట్టు ప్రాంతాలు నీట మునిగినా పట్టించుకోని ఎమ్మెల్యే
- పునరావాస కేంద్రాలను సైతం పట్టించుకోని కూటమి నేతలు
- ప్రజాప్రతినిధి తీరుపై మండిపడుతున్న తిరుపతి వాసులు
- గతంలో భూమన అందించిన సేవలను గుర్తుచేసుకుని ప్రశంసలు

తిరుపతి తుడా : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తిరుపతి నగరంలో కుంభవృష్టి కురుస్తోంది. రోడ్లపై వర్షపు నీరు భారీగా ప్రవహిస్తోంది. డ్రైనేజీలు పొంగడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు మునిగిపోవడంతో స్థానికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. బాధితులను ఆదుకునే వారు కరువయ్యారు. పునరావాస కేంద్రాలకు చేరిన ముంపు ప్రాంతవాసులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటి వరకు తిరుపతి ఎమ్మెల్యే, కూటమినేతలు వాటిని ఆ కేంద్రాల్లో ప్రజలు ఎలా ఉన్నారో కనీసం పరామర్శించలేదని పలువురు విమర్శిస్తున్నారు. కష్ట కాలంలో అండగా నిలవాల్సిన ఎమ్మెల్యే అడ్రస్ లేకుండా పోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్లు మాత్రం వేయించుని, అధికారం చేపట్టి, ప్రజలు నరకం అనుభవిస్తుంటే పలకరించేందుకు కూడా రాలేదని వాపోతున్నారు.

మాజీ ఎమ్మెల్యేపై ప్రశంసలు

గతంలో ఇలాగే తిరుపతిలో భారీ వర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాలు జలమయమైన సందర్భంలో అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అందించిన సేవలు మరువలేమని ప్రజలు ప్రశంసిస్తున్నారు. చిమ్మ చీకట్లో, నడుము లోతు నీటిలో క్షేత్రస్థాయిలో పర్యటించి ధైర్యం చెప్పిన తీరును చర్చించుకుంటున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి క్షేమ సమాచారాలు తెలుసుకున్నారని గుర్తుచేసుకుంటున్నారు. అప్పట్లో వర్షాలకు పాక్షికంగా దెబ్బతిన్న గృహాలకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారని వెల్లడిస్తున్నారు. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.50వేలు వంతున సాయం చేశారని వివరిస్తున్నారు. పునరావాస కేంద్రంలో చేరిన ప్రతి వ్యక్తికీ రూ.2వేలు పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారని ప్రశంసలు కురిపిస్తున్నారు. భూమన స్ఫూర్తితో ఇప్పుడు కూడా వర్ష బాధితులకు ఆర్థికంగా చేయూత అందించాలని కోరుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



శ్రీవారి ఆలయం వెలుపల తమిళనాడు మాజీ సీఎం

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,891 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,423 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

శ్రీవారి సేవలో పన్నీర్ సెల్వం

తిరుమల శ్రీవారిని బుధవారం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం సేవించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అంచారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

క్లుప్తంగా

దొంగ అరెస్టు

– ఆరు బైకుల స్వాధీనం



ద్విచక్ర వాహనాలను, దొంగను చూపిస్తున్న వెస్ట్ పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలోని వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న దొంగను అరెస్ట్ చేసినట్టు వెస్ట్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొర్లగుంట మారుతినగర్‌కు చెందిన మేకల సాయి ప్రకాష్ అలియాస్ ప్రకాష్(27) జులాయిగా తిరుగుతూ ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నాడని తెలిపారు. స్విమ్స్, రుయా సమీపంలో పార్కింగ్ చేసిన పలు బైకులను చోరీ చేశాడన్నారు. ఈ క్రమంలో గరుడ సర్కిల్ నుంచి చెర్లోపల్లి వైపు వెళ్లే రోడ్డులో వెళుతూ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. విచారణలో అతను బైకులను చోరీ చేస్తున్నట్టు తేలిందన్నారు. అతని నుంచి రూ.5 లక్షల విలువైన ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

20న బాక్సింగ్, చెస్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన అండర్–19 బాక్సింగ్, చెస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక చేపట్టనున్నారు. బుధవారం ఈ మేరకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య మాట్లాడుతూ 9గంటలకు తిరుచానూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బాక్సింగ్, 9.30గంటలకు తిరుపతిలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో చెస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆ9, 10, ఇంటర్ చదివే బాలబాలికలు అర్హులని, 10వ తరగతి మార్కులలిస్ట్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో హాజరవ్వాలని సూచించారు.



బేరాలు.. బెదిరింపులు!



- షాపు పెట్టావో.. ఇల్లు కూల్చేస్తాం
- చంద్రగిరి పరిధిలో టీడీపీ నేతల జులుం
- అర్ధరాత్రి జేసీబీతో వెళ్లి దౌర్జన్యం
- శ్రీకాళహస్తిలోనూ లైసెన్స్ పొందిన వారికి వేధింపులు
- తిరుపతిలో 40శాతం వాటా ఇవ్వాల్సిందే అంటూ ఎమ్మెల్యే వర్గీయుల హుకుం
- కూటమి నేతల రౌడీయిజంతో బెంబేలెత్తుతున్న మద్యం దుకాణదారులు

మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు కూటమి నేతల బెదిరింపులు తప్పడం లేదు. జిల్లాలో వైన్ షాపులకు లాటరీ ప్రక్రియ ముగియడం.. అదృష్టం ఉన్న వారికి దుకాణాలు దక్కడం జరిగిపోయింది. ఎదుటి వారి లక్కును కూడా లాక్కోవడం ఎక్కడైనా చూశారా? ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాకాలో అదే జరుగుతోంది. లక్కీడిప్‌లో షాపులు పొందిన వారి నుంచి దౌర్జన్యంగా దుకాణాలు లాక్కుంటున్నారు. మరి కొందరు గుట్టుచప్పుడు కాకుండా లాటరీలో షాపు వచ్చిన వ్యాపారి మిగిలిన మొత్తం చెల్లించకుండా అడ్డుకుని.. చివరకు టీడీపీ నేతలే దక్కించుకుంటున్నారు. పచ్చమూక అరాచకాలను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

- "ఏరా నువ్వు మమ్మల్ని కాదని టెండర్ వేశావు. లక్కీ డిప్‌లో వైన్ షాపు వచ్చిందంట కదా. దాన్ని వేరే వాళ్లకు అమ్మేందుకు బేరం కుదిరిందంటగా. ఇస్తే మాకే ఇవ్వాలి.. మరొకరి విక్రయించడానికి వీల్లేదు. నువ్వు కూడా షాపు పెట్టుకోవడానికి ఒప్పుకోం. మమ్మల్ని కాదని దుకాణం ప్రారంభిస్తే.. నీ షాపుతోపాటు ఇంటినీ కూల్చేస్తాం" అంటూ ఓ టీడీపీ నేత దౌర్జన్యం.
- "రేయ్.. మద్యం దుకాణం కోసం టెండర్ వెయ్యకూడదు అని చెప్పా కదా. అయినా వేశావు. లాటరీలో వచ్చింది కదా అని డబ్బులు కడితే సహించను. మర్యాదగా చెబుతున్నా.. మిగిలిన డబ్బులు కట్టొద్దు. ఎవరైనా అడిగితే నీకు చిల్లర అడ్జెస్ట్ కాలేదని చెప్పు. లేకుంటే తాట తీస్తా" అంటూ పచ్చనేత బెదిరింపు
- "చూడు తమ్ముడు.. నేను అనుకుంది ఒకటి. అయ్యింది ఒకటి. వైన్ షాపుల కోసం నేను మా వాళ్ల పేర్లతో రూ.5 కోట్లు కట్టా. అయితే నాకు వచ్చింది ఐదు దుకాణాలే. మనం ముందుగా మాట్లాడుకున్నట్టు కుదరదు. మీరేం చేస్తారో నాకు తెలియదు. నాకు 40 శాతం వాటా ఇవ్వాల్సిందే. కాదూ కూడదు అంటే.. జరిగే నష్టానికి నాకు సంబంధం లేదు" ఓ ప్రజాప్రతినిధి బేరం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తిరుపతి, చిత్తూరు జిల్లాలో మొత్తం 331 మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ ముగిసిన విషయం తెలిసిందే. లక్కీ డిప్‌లో షాపులు దక్కించుకున్న వ్యాపారులు బుధవారం నుంచి దుకాణాలను తెరుచుకోవాల్సి ఉంది. అయితే కూటమి నేతల బెదిరింపులు ఓ వైపు, షాపులు దక్కించుకున్న వారికి స్థలాలు ఇవ్వకుండా అడ్డుకోవడం మరో వైపు. ఫలితంగా తిరుపతి, చిత్తూరు జిల్లాలో కేవలం 127 షాపులు మాత్రమే ప్రారంభమయ్యాయి. 204 దుకాణాలు ఇప్పటికీ మొదలుకాలేదు. పలమనేరు, పూతలపట్టు, నగరి, తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి పరిధిలో టీడీపీ, జనసేన నేతల అరాచకాల కారణంగా మద్యం దుకాణదారులు భయాందోళనలో ఉన్నారు.

రూ.99 హుళక్కే!

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే.. రూ.99కే నాణ్యమైన మద్యం అందిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు కొత్త మద్యం పాలసీని ప్రవేశపెట్టినా తక్కువ ధరకే మద్యం మాత్రం అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. కొన్ని బ్రాండ్లు పాత ధరలకే విక్రయిస్తున్నారు. మరి కొన్నింటిని క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.30 అదనంగా అమ్ముతున్నట్లు కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షంలోనూ కొనసాగుతున్న నిరసన దీక్ష!



వర్షం కురుస్తున్నా దీక్ష చేస్తున్న శ్రీవారి మెట్టు వ్యాపారులు, సీఐటీయూ నాయకులు

తిరుపతి(అలిపిరి): తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో గత 57 రోజులుగా టీటీడీ పరిపాలన భవనం ఎదుట శ్రీవారిమెట్టు వ్యాపారులు చేస్తున్న నిరసన దీక్షలు బుధవారం వర్షం పడుతున్నా కొనసాగించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, 31 కుటుంబాలు చేస్తున్న నిరసన దీక్షలపై టీటీడీ ఈఓ ఇప్పటివరకూ స్పందించకపోవడం బాధాకరమని నిరసించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, గంగులప్ప, శ్రీవారిమెట్టు వ్యాపారుల సంఘం నాయకులు యుగంధర్, చిట్టిబాబు, మధు, చిరంజీవి, పెంచలయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి వాహనం నడిపిన కేసులో యోగి మల్లవరానికి చెందిన కె.సురేష్ అనే వ్యక్తి రెండు రోజులు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. మరో 24 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



లోతట్టు ప్రాంతాలలో ప్రవహిస్తున్న నీటి కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

- నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు రోడ్లపైకి, లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లకుండా అన్ని చర్యలు తీసుకున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం నుంచి కురుస్తున్న వర్షాల మూలంగా నగరంలోని అన్ని డివిజన్లలో చేస్తున్న పారిశుధ్య పనులు, సహాయక చర్యలను బుధవారం అధికారులతో కలసి పలు ప్రాంతాలలో పరిశీలించి ఆమె మాట్లాడారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, ఆటోనగర్, తదితర ప్రాంతాల్లో చేరిన వర్షపునీటిని తొలగించేందుకు ప్రత్యామ్నాయంగా కాలువలు తీస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జేసీబీలతో అన్ని ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేశామని, అలాగే ప్రధాన కూడళ్లు, అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలవడంతో మోటార్ల సాయంతో ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. నగరంలో విద్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నట్టు చెప్పారు. కొరమేనుగుంట, ఉప్పంగి హరిజనవాడ తదితర ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు కొంత మందిని తరలించి అన్ని సదుపాయాలను కల్పించామన్నారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలు వర్షాల నేపథ్యంలో సమస్యలను హెల్ప్ లైన్ నంబర్ 0877 2256766కు తెలియజేస్తే తమ సిబ్బంది సాయం అందిస్తారన్నారు. ప్రజలంతా ఇళ్లకే పరిమితం కావాలని, అత్యవసరమైతేనే బయట రావాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి ఆధారం వైఖానస ఆగమం



జాతీయ సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు

తిరుపతి సిటీ : భారతీయ సంస్కృతికి ఆధారం వైఖానస ఆగమమేనని మైసూర్ మహారాజ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సత్యనారాయణ తెలిపారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో బుధవారం వైఖానస ఆగమోక్త అర్చనం అన్న అంశంపై జాతీయ సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఖానస ఆగమోక్త అర్చనా విధానం లోకక్షేమానికి ప్రధాన కారణభూతమైందన్నారు. ఆలయ నిర్మాణం నుంచి ప్రాయశ్చిత్తాల వరకు వేదమంత్రాలతో ఇమిడి ఉన్నదే వైఖానసాగమమని చెప్పారు. ఇందులో సందేహాలు ఏర్పడితే విశ్వవిద్యాలయ ఆగమ కన్సల్టెన్సీ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. అనేక గ్రంథాలు వైఖానస వాఙ్మయంలో మహర్షులు ఉపదేశించినప్పటికీ కొన్ని మాత్రమే ప్రస్తుతం లభ్యమవుతున్నాయని తెలిపారు. మిగిలిన వాటిని సమకూర్చుకుని, సంస్కరించి ప్రాంతీయ భాషల్లో అనువదించాల్సిన బాధ్యత పండితులపై ఉందన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వరస్వామికి అర్చనల వైఖానస ఆగమంలో చెప్పిన విధంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. వైఖానసాగమ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు వర్సిటీలో ప్రయోగశాలలను ఏర్పాటు చేశామని, విద్యార్థులు నిత్య పూజాకైంకర్యాలపై అవగాహన పెంచుకుని ఆగమ విజ్ఞానాన్ని పొందుతూ ఉద్యోగావకాశాలు పొందుతున్నారని తెలిపారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అర్చనా జ్ఞానం వైదికులు, లౌకికులకు తెలియజేయడం అవసరమని, ఆగమ శాస్త్రంలోని విశేషాలను ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శించాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథులను వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, ఆగమ ప్రముఖులు దీవి రాఘవ దీక్షితులు, అర్చకులు వెంకటరమణ, ఏవీ రమణాచార్యులు, విష్ణుభట్టాచార్యులు, రంగరామానుజాచార్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కుప్పంరూరల్: పట్టణంలోని గాంధీరోడ్డులో ఓ యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. ఆరునెలల క్రితం తల్లి చనిపోవడంతో మనస్తాపం చెందిన చాంద్‌బాష (27) ఇంటిలోని పైకప్పుకు ఉరి వేసుకున్నాడు. పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు స్థానికులు చెప్పారు.

జలపాత ఝురి.. చూసొద్దాం మరి



తిరుపతిలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి శేషాచల పర్వత సానువుల్లో తీర్థాలు హోరెత్తుతున్నాయి. వరుణుడు ధాటికి తిరుపతి కపిలతీర్థంలో జలపాతం సరికొత్త సోయగాలు చిందిస్తోంది. జలపాత సవ్వడి బుధవారం భక్తులకు కనువిందు చేసింది. పలువురు సెల్‌ఫోన్లలో నిక్షిప్తం చేసుకున్నారు. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

తిరుపతి రూరల్ : మండలంలోని గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మీనగర్‌కు చెందిన భాగ్యమ్మ అనే మహిళ ఇంట్లో చోరీ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఈ మేరకు సీఐ చిన్నగోవిందు వివరాలు వెల్లడించారు. గత నెల 25వ తేదీన బాధితురాలి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బీరువాను పగులగొట్టి 17 గ్రాముల బంగారు నగలను అపహరించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జీవకోనకు చెందిన పాత నేరస్తుడు వరదరాజులమణిని నిందితుడిగా గుర్తించారు. బుధవారం వైకుంఠపురం వద్ద సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కుదువ పెట్టిన చోరీ సొత్తును రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు.

తల్లిని చంపిన కొడుకు అరెస్ట్

చిల్లకూరు : మండలంలోని కమ్మవారిపాళెంలో తల్లిని చంపిన కొడుకును పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. నిందితుడు మనోజ్ నాలుగు రోజుల క్రితం తన తల్లిపై కత్తితో దాడి చేశాడు. ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించింది. ఈ క్రమంలో నిందితుడిని కోట క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

తిరుమలలో భారీ వర్షం





తిరుమల శ్రీవారి సన్నిధిలో బుధవారం కుంభవృష్టి కురిసింది. కొండపై చలి తీవ్రత పెరిగింది. దీంతో భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. తల దాచుకునేందుకు చలువ పందిళ్లను ఆశ్రయించారు. ముఖ్యంగా చిన్నపిల్లల తల్లిదండ్రులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

– తిరుమల

విహంగం.. స్వాగతం





చెట్లపై విడిది చేసిన నత్తగుల్లకొంగలు, తెల్లకంకణాయిలు

భారీ వర్షాల నేపథ్యంలో నేలపట్టు పక్షుల కేంద్రంలోని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ప్రధానంగా అత్తిగుంట, మారేడుగుంట, నేరేడుగుంట నీటితో నిండుతున్నాయి. విదేశీ విహంగాలకు సాదర స్వాగతం పలుకుతున్నాయి. దీంతో వలస పక్షులైన నత్తగుల్ల కొంగలు(ఓపెన్ బిల్ స్టార్క్), తెల్లకంకణాయిలు(వైట్ ఐబీస్) వందల సంఖ్యలో తరలివస్తున్నాయి. చెట్లపై విడిది చేసి సందడి చేస్తున్నాయి. జతకట్టేందుకు సహచర పక్షులను ఎంపిక చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే గూడ బాతులు, తెడ్డుముక్కు కొంగలు, నీటి కాకులు, స్వాతి కొంగలు, పాము మెడ పక్షులు, శబరి కొంగల రాక కోసం ఎదురుచూస్తున్నాయి.

– దొరవారిసత్రం





నేలపట్టు పక్షుల కేంద్రంలోని చెరువుకు జలకళ